సాక్షి ఆదిలాబాద్

ఆదివారం | 19 | జనవరి | 2025



కారడవిలో.. కొండలరాయుని చరిత్ర

దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతంలోని కొండలరాయుని చరిత్ర అరణ్యంలోనే మరుగున పడుతోంది.

8లో▸



సైబర్ కేటుగాళ్ల వల

సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నారు. మాయమాటలు చెప్పి అమాయకులను నమ్మిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు.

8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 28.0/12.0

వాతావరణం పొడిగా ఉంటుంది. వేకువ జామున పొగమంచు ప్రభావం కనిపిస్తుంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రేపటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 20న రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నందున కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని కోరారు.

అండర్‌టేకింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: మ్యూచువల్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు శనివారం అండర్‌టేకింగ్ తీసుకున్నారు. ఈ బదిలీలకు సంబంధించి 41 మంది జాబితా డీఈవో కార్యాలయానికి చేరింది. మ్యూచువల్ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అండర్‌టేకింగ్‌లో తాము సీనియారిటీ కోల్పోతామని తదితర వివరాలతో పూర్తిచేసిన ప్రొఫార్మాను తీసుకున్నారు. త్వరలో పరస్పర బదిలీ చేసుకున్న ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు స్థానచలనం కలగనుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ చేపట్టనున్నారు.

టీబీ నియంత్రణకు కృషి చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: టీబీ నియంత్రణకు కృషి చేయాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిక్షయ్ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షయపై అవగాహన ఉంటేనే నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఈ దిశగా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 100 రోజుల నిక్షయ్ శిబిర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నమోదైన కేసుల వివరాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. అలాగే డ్రోన్ సాయంతో మందులను ఏ విధంగా పంపిణీ చేస్తున్నారో అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీటీసీవో సుమలత, సాయి ప్రియ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. జిల్లా కేంద్రంలో మూడు, ఉ ట్నూర్, బోథ్‌లో ఒక్కోటి చొప్పున పరీక్ష కేంద్రాల ను ఏర్పాటు చేశారు. మావల సమీపంలోని చావరా అకాడమీలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 240 మందికి గాను 192 మంది హాజరయ్యారు. అలాగే జిల్లా కేంద్రంలోని లిటిల్‌ఫ్లవర్ పాఠశాలలో 192కు గాను 150 మంది, ప్రభుత్వ బాలికల పాఠశాలలో 204 మందికి గాను 158 మంది హాజరయ్యారు. ఇక బోథ్‌లోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌లో 271 మందికి గాను 230 మంది, ఉట్నూర్‌లోని పూలాజీబాబా పరీక్ష కేంద్రంలో 263 మందికి గాను 232 మంది హాజరైనట్లు డీఈవో ప్రణీత తెలిపారు. మొత్తం 1,170 మందికి గాను 962 మంది హాజరు కాగా, 208 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలను డీఈవోతో పాటు పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, నవోదయ విద్యాలయ అధికారులు పర్యవేక్షించారు.



పరీక్ష కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థులు

మంటగలిసిన మానవత్వం



బ్యాంకు సీసీ ఫుటేజీలో పురుగుల మందు తాగుతున్న రైతు జాదవ్ దేవ్‌రావు



జాదవ్ దేవ్‌రావు (ఫైల్)

- అప్పు చెల్లించాలని 'ఐసీఐసీఐ' వేధింపులు
- బ్యాంకులోనే పురుగుల మందు తాగిన రైతు
- ఆస్పత్రికి తరలింపులోనూ సిబ్బంది నిర్లక్ష్యం
- కొడుకొచ్చేదాకా తప్పని నిరీక్షణ
- అంతలోనే గాలిలో కలిసిన ప్రాణం
- రోడ్డున పడిన బాధిత కుటుంబం

మాయమైపోతున్నదమ్మా మనిషన్నవాడు.. అన్న గేయానికి సరిగ్గా సరిపోయే సంఘటన ఇది. కళ్ల ముందు ఓ వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడితే శత్రువైనా సరే కాపాడేందుకు ముందుకొస్తారు. కానీ ఓ రైతు బ్యాంకు అధికారులు, సిబ్బంది ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినా వారు స్పందించకపోవడంతో ఓ నిండు ప్రాణం గాలిలో కలిసిపోయింది. రిమ్స్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆ బ్యాంకులోనే అన్నదాత తనువు చాలించడం ఆ ఉద్యోగుల మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది. అందరూ చూస్తుండిపోవడమే తప్పా ఆస్పత్రికి తరలించే వారు కరువయ్యారు. కొంత మంది సెల్‌ఫోన్లలో ఆ దృశ్యాలను బంధించే ప్రయత్నం చేయడం గమనార్హం. బాధిత కుటుంబీకులు వచ్చిన తర్వాత ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. త్వరగా తీసుకొచ్చి ఉంటే ప్రాణాలు నిలిచేవని తెలిపినట్లు తెలుస్తోంది. ఈ విషాదకరమైన ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఒక్కగానొక్క కుమారుడు, భార్య రోధించిన తీరు అందరినీ కలిచివేసింది. – ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్

బేల మండలంలోని రేణుగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు(55) 2019లో జిల్లా కేంద్రంలోని దస్నాపూర్‌లో గల ఐసీఐసీఐ బ్యాంకులో కిసాన్ క్రెడిట్ క్రాప్ (కేసీసీ) కింద రూ.3లక్షల 40వేల రుణం తీసుకున్నాడు. తన భార్య కిడ్నీ చెడిపోవడంతో తనకున్న రెండున్నర ఎకరాల భూమిని బ్యాంకులో మార్టిగేజ్ చేయించి అప్పు పొందాడు. ఆరు నెలలకోసారి రూ.25వేల చొప్పున చెల్లిస్తున్నాడు. ఏడాది వరకు కిస్తీలు బాగానే చెల్లించాడు. అయితే సాగు చేసిన పత్తి దిగుబడి సరిగా రాకపోవడంతో పాటు భార్య అనారోగ్యంతో అప్పులు పెరిగాయి. ఈ క్రమంలో గత రెండు కిస్తీలు చెల్లించలేకపోయాడు.

బ్యాంకు అధికారుల వేధింపులు

కిస్తీలు చెల్లించాలని ఇటీవల బ్యాంకు అధికారులు సదరు రైతు నివాసానికి వెళ్లారు. వెంటనే అప్పు చెల్లించాలని వేధించారు. దీంతో ఆయన మనస్తాపానికి గురయ్యాడు. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేయడంతో బ్యాంకుకు వచ్చిన దేవ్‌రావు అధికారులను ప్రాధేయపడ్డాడు. అయినా వినిపించుకోకపోవడంతో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందును వారిముందే తాగాడు. సిబ్బందితో పాటు అధికారులు అలాగే చూస్తుండిపోయారే తప్ప ఆయన్ను పక్కనే ఉన్న రిమ్స్ ఆసుపత్రికి మాత్రం తరలించలేదు. రైతే తన కుమారుడికి ఫోన్‌చేసి పురుగుల మందు తాగిన విషయం చెప్పాడు. 15 నిమిషాల వరకు బ్యాంకులోనే ఉండగా ఆ తర్వాత అక్కడికి చేరుకున్న కుమారుడు, బంధువులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బ్యాంకుకు కూతవేటు దూరంలోనే ఆసుపత్రి ఉండగా,అక్కడి సిబ్బంది వెంటనే తరలించి ఉంటే ప్రాణాలు దక్కేవని కుటుంబీకులు పేర్కొన్నారు. మృతుడి భార్య కిడ్నీ సమస్యతో మంచానికి పరిమితం కాగా ఇంటి పెద్దను కోల్పోయిన ఆ కుటుంబానిది ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితి.



బ్యాంకు వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శంకర్



రైతు తాగిన పురుగుల మందు డబ్బా

బ్యాంకు అధికారులపై కేసు నమోదు చేయాలి : ఎమ్మెల్యే శంకర్

రైతు మృతికి కారణమైన బ్యాంకు అధికారులపై కేసు నమోదు చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. ఘటన సమాచారం అందుకున్న ఆయన రిమ్స్‌కు చేరుకొని కుటుంబీకుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ప్రజలకు అన్నం పెట్టే రైతులను వేధింపులకు గురిచేయడం ఏంటని బ్యాంకు అధికారులపై మండిపడ్డారు. మానవత్వం మరిచేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయ విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి అండగా నిలవాలని పేర్కొన్నారు. అలాగే మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న రిమ్స్‌కు చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే బాధిత కుటుంబీకులు, బంధువులు బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు అక్కడ బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

చకచకా ఏర్పాట్లు



సొనాలలో ఏర్పాటు చేసిన నూతన ఎంపీడీవో కార్యాలయానికి రంగులు వేసి తీర్చిదిద్దుతూ..

- కొత్త మండలాల్లో చురుగ్గా పనులు
- రూ.15లక్షల నిధులు మంజూరు
- ఫర్నిచర్, ఉద్యోగుల కేటాయింపు
- భవనాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది
- నెలాఖరులో పాలన ప్రారంభమయ్యే అవకాశం

కైలాస్‌నగర్: జిల్లాలో కొత్తగా ఆవిర్భవించిన మూడు మండలాల్లో త్వరలోనే పాలన షురూ కానుంది. ఈ మేరకు చకచకా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కార్యాలయాల గుర్తింపు, ఉద్యోగులు, సిబ్బంది సర్దుబాటు ప్రక్రియ పూర్తయ్యాయి. తాజాగా ఆయా ఆఫీసుల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఒక్కో మండలానికి రూ.5లక్షల చొప్పున రూ.15లక్షల నిధులు కేటాయిస్తు కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయా కార్యాలయాల భవనాలకు రంగులు అద్దుతుండటంతో పాటు మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఫర్నిచర్ సైతం ఆయా మండలాలకు కేటాయించారు. ఈ నెల 26 వరకు అన్ని హంగులతో వాటిని సిద్ధం చేసి నెలాఖరు వరకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. అన్ని అనుకున్నట్లు జరిగితే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచే సాత్నాల, భోరజ్, సొనాల మండలాల్లో పాలన ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

రెండు కార్యాలయాలే..

నూతన మండలాల్లో తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను మాత్రమే ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఇప్పటికే భవనాలను గుర్తించారు. సొనాల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలను అక్కడి మండల కేంద్రంలోని పాత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. భోరజ్ మండలానికి సంబంధించి ఎంపీడీవో కార్యాలయం అక్కడి గ్రామ పంచాయతీ భవనంలో, తహసీల్దార్ కార్యాలయాన్ని పాత మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశారు. సాత్నాల తహసీల్దార్ కార్యాలయాన్ని సాత్నాల ప్రాజెక్ట్ సమీపంలోని మత్స్యశాఖ భవనంలో, అలాగే ఎంపీడీవో కార్యాలయాన్ని ఇరిగేషన్ గోడౌన్‌లో ఏర్పాటు చేశారు. ఆ భవనాలన్నీ ఏళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో వాటిని వినియోగంలోకి తెచ్చేలా మరమ్మతులు చేస్తున్నారు. సున్నంతో పాటు కొత్తగా రంగులు అద్ది ముస్తాబు చేస్తున్నారు. ఉద్యోగులు, సిబ్బందితో పాటు వివిధ పనుల కోసం వచ్చేవారికి అవసరమైన మరుగుదొడ్లు, తాగునీటి వంటి కనీస వసతులు కల్పించేలా చర్యలు చేపట్టారు. ఇందుకోసం ఒక్కో మండలానికి రూ.5లక్షల చొప్పున ప్రత్యేక నిధులు మంజూరు చేసిన కలెక్టర్ అందులో రూ.2.5లక్షలను ముందుగానే అవిభాజ్య మండల ఎంపీడీవోల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వారి పర్యవేక్షణలోనే ఈ పనులు యుద్ధ ప్రతిపాదికన సాగుతున్నాయి.

ఉద్యోగుల సర్దుబాటు, ఫర్నిచర్ కేటాయింపు

ఆయా మండలాల్లో పరిపాలన వ్యవహారాలు సాగించేందుకు వీలుగా ఉద్యోగులు, సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నారు. ప్రతి మండలానికి సూపరింటెండెంట్, ఎంపీవో, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, ఆఫీస్ సబార్డినేట్ చొప్పున ఐదుగురు ఉద్యోగులను కేటాయించారు. సూపరింటెండెంట్, ఎంపీవోలే ఎంపీడీవోలుగా ఆయా మండలాల్లో బాధ్యతలు నిర్వహించనున్నారు. వీరిని ఆయా మండలాలతో పాటు జెడ్పీ నుంచి సర్దుబాటు చేస్తున్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలకు సైతం డిప్యూటీ తహసీల్దార్, సూపరింటిండెంట్, జూనియర్ అసిస్టెంట్, ఆఫీసర్ సబార్డినేట్లను కేటాయిస్తున్నారు. వీరిని రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉద్యోగుల సంఖ్యకనుగుణంగా కేటాయించనున్నారు. అలాగే కార్యాలయాల నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, కంప్యూటర్లు వంటి సామగ్రిని ఇప్పటికే అక్కడికి తరలించారు. పాత మండలంలోని పంచాయతీలకనుగుణంగా వాటిని కొత్త మండలాలకు కేటాయిస్తున్నారు. ఈ నెల 25వరకు పూర్తయ్యే అవకాశమున్నట్లుగా అధికారులు చెబుతున్నారు.

డీడీవో కోడ్‌లు సైతం...

కొత్తగా ఏర్పాటయ్యే మండలాల్లో పాలనపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా డీడీవో (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్) కోడ్‌లతో పాటు బ్యాంకు అకౌంట్లను ప్రత్యేకంగా కేటాయించేలా ట్రెజరీ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. మండలాల ప్రారంభంనాటికి వాటిని అందించేలా అధికారులు దృష్టి సారించారు.

నెలాఖరున ప్రారంభం



నూతన మండలాల్లో ప్రజలకు పాలనను అందుబాటులోకి తెచ్చేందుకు యుద్ధప్రతిపాదికన కసరత్తు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యోగులు, ఫర్నిచర్‌ను ఆయా కార్యాలయాలకు కేటాయించాం. భవనాల్లో చిన్నపాటి మరమ్మతులు, వైట్‌వాష్ పనులు కొనసాగుతున్నాయి. ఈ నెల 25వరకు అన్ని పనులు పూర్తి చేసి కార్యాలయాలను నేమ్‌బోర్డులతో సహా సిద్ధంగా ఉంచుతాం. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క చేతుల మీదుగా ఈ నెలాఖరులో కొత్త మండలాలను ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఫిబ్రవరి మొదటి వారంలో పరిపాలన అందుబాటులోకి వచ్చే అవకాశముంది. –జి.జితేందర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో

సర్వర్ డౌన్

- మధ్యాహ్నం వరకు నిలిచిన రిజిస్ట్రేషన్లు



పడిగాపులు కాస్తున్న ప్రజలు



బోసిపోయిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కైలాస్‌నగర్: రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్ రెండు రోజులుగా మొరాయిస్తోంది. రాష్ట్రస్థాయిలో తలెత్తిన సాంకేతిక సమస్యలతో సర్వర్‌డౌన్ అవుతుంది. ఫలితంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతోంది. శనివారం మధ్యాహ్నం 3గంటల వరకు ఇదే సమస్య. దీంతో నిత్యం క్రయ విక్రయదారులతో సందడిగా కనిపించే జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం బోసిపోయింది. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు గంటల తరబడి పడిగాపులు తప్పని పరిస్థితి. రెండు రోజులుగా రిజిస్ట్రేషన్ కోసం నిరీక్షిస్తున్నామని భీంపూర్ మండలం అర్లి(టి) గ్రామానికి చెందిన దేవురావు కుటుంబీకులు వాపోయారు. కాగా, మధ్యాహ్నం 3గంటల సమయంలో సమస్య పరిష్కారం కావడంతో రిజిస్ట్రేషన్లు యథావిధిగా ప్రారంభమయ్యాయి. శనివారం 40 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ విజయ్‌కాంత్ రావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో తలెత్తిన కారణంగానే సర్వర్ డౌన్ అయినట్లుగా ఆయన వివరించారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- నూతన కానిస్టేబుళ్లకు మూడు వారాల శిక్షణ పూర్తి
- ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ గౌస్ ఆలం



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం



పాల్గొన్న నూతన కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. జిల్లా కేంద్రంలో మూడు వారాలుగా నిర్వహిస్తున్న నూతన కానిస్టేబుళ్ల శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కార్యక్రమానికి ఎస్పీ హాజరై శిక్షణ సిబ్బందికి పలు సూచనలు చేశారు. నేర పరిశోధనలో సాక్ష్యాధారాలే ప్రధానమన్నారు. కోర్టులో నేరం నిరూపించేందుకు అవి కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అలాగే స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలన్నారు. సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రజలకు పోలీసులపై ఉన్న గౌరవాన్ని కీర్తిని పెంపొందించే దిశగా కృషి చేయాలన్నారు. న్యాయం అందిరకీ సమానమే అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ మనసులో ఉంచుకుని విధులు నిర్వర్తించాలన్నారు. కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకమైందని వాటిని ఉపయోగించే విధానాన్ని నేర్చుకొని అమలుపరచాలని సూచించారు. శిక్షణలో భాగంగా సిబ్బంది కోర్టు డ్యూటీ విధులు, రిసెప్షన్ విధులు, పిటీషన్ మేనేజ్మెంట్ విధులు, బ్లూ కోర్ట్, డయల్ 100, పెట్రోలింగ్, బిట్ సిస్టం, అనుమానితులను పరిశీలించడం, నేర నియంత్రణ, నేర పరిశోధన, సీసీటీఎన్ఎస్, సైబర్ క్రైమ్, సీఈఐఆర్ ముఖ్యంగా ప్రమాదాల సమయంలో ప్రజలను కాపాడేందుకు ఉపయోగపడే సీపీఆర్ పద్ధతిపై సిబ్బందికి పూర్తి అవగాహన కల్పించారు. కోర్టు విధులు న్యాయపరంగా వచ్చే సమస్యలపై శిక్షణ అందించిన మాజీ పీపీ రమణారెడ్డి, ఫిజికల్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ అందించిన పురుషోత్తం రెడ్డి, సుధీర్ రెడ్డిలను అనంతరం శాలువాలతో సత్కరించి అభినందించారు. ఇందులో డబ్ల్యూపీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, నూతన కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

హలో.. నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్న

- 'పది' విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీకాన్ఫరెన్స్
- పరీక్షలయ్యే వరకు ఇతర పనులు చెప్పవద్దని హితవు



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: 'హలో.. నేను కలెక్టర్‌ను మాట్లాడుతున్న.. మీ పాప/బాబు ఎలా చదువుతున్నారు.. బాగా ప్రిపేర్ అవుతున్నారా.. ఇంట్లో ఎలా ఉంటారు.. పరీక్షలయ్యే వరకు వారికి ఎలాంటి పనులు చెప్పకండి.. నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయిలో ఉన్నా.. మీ పిల్లలను కూడా నాలా కలెక్టర్‌ను చేసేలా చదివించండి.. వారు ఆరోగ్యంగా ఉండేలా చూడండి..' అంటూ కలెక్టర్ రాజర్షి షా పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పది పరీక్షల సన్నద్ధతపై ప్రభుత్వ యాజమాన్యాల ఉన్నత పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం తన క్యాంప్ కార్యాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. మంచి ఫలితాలు సాధించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే నెలన్నర రోజులు విద్యార్థులకు ఇతర పనులేవీ చెప్పకుండా చదువుపైనే దృష్టి సారించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఉదయం 5గంటలకు నిద్ర లేపి చదివించడంతో పాటు టీవీ, మొబైల్, ఇంటర్‌నెట్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. ఇంట్లో ఒత్తిడికి లోను కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. ప్రశాంతంగా చదివి అత్యుత్తమ గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధిస్తే బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించవచ్చన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, డీసీఈబీ సెక్రెటరీ గజేందర్, ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్ పాల్గొన్నారు.

ఆరోగ్య పాఠశాలగా తీర్చిదిద్దాలి

కైలాస్‌నగర్: విద్యార్థుల్లో మార్పు కోసమే ఆరోగ్య పాఠశాల కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లతో కార్యక్రమ అమలుపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య పాఠశాల ద్వారా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను 44 ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం వారికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. సమావేశంలో డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఆదిలాబాద్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన బ్రహ్మకుమారి వ్యవస్థాపకులు బ్రహ్మ బాబా స్మృతి దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సూచించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న , కేంద్రం నిర్వాహకురాలు రేవతి బెహన్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కారడవిలో.. కొండలరాయుని చరిత్ర

- దట్టమైన అడవిలో నిట్టనిలువుగా కొండ
- చుట్టూ రాతి కంచె..
- వెలుగులోకి తెచ్చిన చరిత్రకారుల బృందం
- ఆర్కియాలజీ, పురావస్తు శాఖలు చొరవ చూపితే పర్యాటక శోభ


కొండల రాయుని గుట్టను చూపుతున్న కరిపె రాజ్‌కుమార్

ఖానాపూర్: దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ కోటను కాపాడి చరిత్రను వెలుగులోకి తెచ్చే వారు లేరు. దీంతో చరిత్ర మరుగున పడే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల మధ్యలోని దట్టమైన అటవీప్రాంతంలో నిట్టనిలువుగా ఉన్న ఒక పెద్ద గుట్టపైన కొండల రాయుని కోట శిథిలాలు ఉన్నాయి. గుట్ట కింది భాగం నుంచి శిఖరాగ్రం వరకు సుమారు కిలోమీటరు పైనే ఉంటుందని చరిత్రకారులు బృందం సభ్యులు కరిపె రాజ్‌కుమార్, కరిపె రాజశేఖర్, గోండు మధు, చాకలి హన్మంతు తెలిపారు. ఇటీవల అత్యంత శ్రమకోర్చి శిథిల రాతి కంచెను గుర్తించారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో కొండ వ్యాపించి ఉంది. కోటకు మొదట్లో ద్వారపు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దారి వెంబడి పైకి వెళ్తున్న కొద్దీ పెద్ద పెద్ద బేటురాళ్లు అక్కడక్కడ దర్శనమిస్తాయి. ఎత్తైన ప్రదేశాల్లో అంతస్తుల తరహాలో రాళ్లతో పటిష్టంగా నిర్మించిన బురుజులు ఉన్నాయి. ప్రతీ వందమీటర్ల ఎత్తుకు వెళ్లే కొద్దీ ఒక్కో దిక్కులో అనేక బురుజులు కనిపిస్తాయి.

సమాధిలాంటి రాతి నిర్మాణాలు

శిఖరాగ్రంలోని ఆగ్నేయ దిక్కులో ఒక పెద్ద సమాధి లాంటి రాతి నిర్మాణం సుమారు 20 అడుగుల ఎత్తులో నిర్మించి ఉంది. ఈ రాతి నిర్మాణం శిథిలమైనప్పటికీ దీనినే కొండల రాయుడి సమాధిగా చరిత్రకారులు భావిస్తున్నారు. దిగువన పడమటి దిక్కున సైతం కొంచెం చిన్నదిగా అలాంటి మరో నిర్మాణం ఉంది. దీన్ని రాణి సమాధిగా ప్రజలు భావిస్తున్నారు. చుట్టూ కొలత దాదాపు 8 కిలోమీటర్లకు పైగా ఉంది. రాతి కంచె ఎక్కడా కూడా శిథిలం కాలేదు. ఈ మార్గం వెంబడి లోహ పరిశ్రమకు చెందిన ఇనుప చిట్టెంలు, కాల్చిన ఇటుకలు కూడా గుర్తించారు.


గుట్టపై లభించిన కాల్చిన ఇటుక


గుట్టపై లభించిన ఇనుప చిట్టెంలు

ఆర్కియాలజీ, పురావస్తు శాఖ చొరవ చూపాలి

బలుమూరి కొండయ్య 1690–1720 నిజామాబాద్ జిల్లాలోని భీమ్‌గల్ జాగీరు కోసం గోల్కొండ పాలకులతో యుద్ధానికి దిగినట్లు చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అపజయాన్ని శంకించి భీమ్‌గల్‌లోని పల్లికొండ దగ్గర బాచనపల్లి చిన్నోల్ల గుట్ట మీద ఆత్మహుతి చేసుకున్న కొండల రాయుడి దేహాన్ని ఆయన అనుచరులు కామారెడ్డి దగ్గరలోని వెల్లుల్లపేటలో సమాధి చేశారని మరో కథ ప్రచారంలో ఉంది. వీటన్నింటినీ మరిన్ని వివరాలతో వెలుగులోకి వచ్చేలా పురావస్తు, ఆర్కియాలజీ శాఖలు చొరవ చూపితే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

కాకులు దూరని కారడవి..

కాకులు దూరని కారడవిలా ఉన్న ఈ ప్రాంతంలో బహుశా కత్తుల తయారీ జరిగి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కొండల రాయుడు గుర్రంపైన చాలా వేగంగా ప్రయాణించేవాడని, ఈ ప్రాంత ప్రజలందరికీ ఆరాధ్యుడనే విషయం బొబ్బిలి కథకుల ద్వారా తెలుస్తోంది. కొడుకా..కొండల రాయుడా.. అనే మకుటంతో ఒక స్మృతి గీతం అప్పుడప్పుడు ప్రజల నోళ్లలో ఇప్పటికీ నానుతూనే ఉంది.

చరిత్ర వెలుగులోకి తేవాలి

కొండల రాయుని గురించి ప్రజలు పాడుకున్న జానపద గీతం, బిరుదు తదితర సమాచారం, చరిత్ర పుటల్లోంచి నేటి సమాజానికి తెలిసి వచ్చేలా పురావస్తు శాఖ, ఆర్కియాలజీ శాఖలు, ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రముఖ చరిత్ర పరిశోధన బృందంతో కలిసి సమష్టిగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా భవిష్యత్ తరాలకు గత చరిత్రలు తెలియవస్తాయి.
– కరిపె రాజ్‌కుమార్, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు

క్లుప్తంగా

గంగాజలంతో ఉట్నూర్‌కు మెస్రం వంశీయులు


ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌రూరల్: జిల్లాలోని కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు మెస్రం వంశీయులు కాలినడకన జన్నారం మండలం కలమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. గంగాజలం తీసుకుని తిరుగుపయనంలో శనివారం ఉట్నూర్‌లోని గోండుగూడకు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, యువనాయకుడు జయచంద్ర స్వాగతం పలికారు. వారు కొంతసేపు సేద తీరారు. రాత్రి ఉట్నూర్‌లో బస చేసి ఆదివారం ఉదయం ఇంద్రవెల్లికి బయల్దేరనున్నారు. ఆలయ చైర్మన్ కోసేరావు పటేల్, మెస్రం వంశీయులు ఉన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు


సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని, వీటికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ట్రికార్ ద్వారా చెక్కులను శనివారం సంఘాల సభ్యులకు అందజేశారు. ట్రికార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన మండలాల రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల చెక్కులను సభ్యులకు అందించారు. ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞశీల్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఖేలో ఇండియా అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైంది. గతనెల 21న మంచిర్యాలలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.

ఉదారత చాటిన తోటి కానిస్టేబుళ్లు

- కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: తోటి కానిస్టేబుల్ మృతిచెందడంతో కానిస్టేబుళ్లు ఉదారత చాటారు. తమవంతుగా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చారు. 2004 ఏఆర్ బ్యాచ్‌కు చెందిన పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అఖ్తర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబీకులకు ఉమ్మడి జిల్లా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు శనివారం రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య, పిల్లలకు రూ.1.50 లక్షలు, అఖ్తర్ తల్లిదండ్రులకు రూ.50 వేల నగదు అందించారు. ఆర్‌ఐ డి.వెంకట్, కానిస్టేబుళ్లు కిశోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాశ్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీశ్, కైలాస్ పాల్గొన్నారు.

హాజీపూర్‌లో అటవీ ప్రాంతాల సందర్శన


గఢ్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలను ప్రకృతి ప్రేమికులు శనివారం సందర్శించారు. చిన్నగోపాల్‌పూర్, గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ జంతువులను వీక్షించారు. స్వీడన్, లండన్ నుంచి విచ్చేసిన సంగీత కళాకారులతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఉన్నారు.

దైవదర్శనానికి వెళ్తూ కానరాని లోకాలకు

- కోతులను తప్పించబోయి కారు బోల్తా
- బూరుగుపల్లి సమీపంలో ఘటన
- ఇద్దరు అక్కడికక్కడే మృతి.. ముగ్గురికి గాయాలు
- రెండు కుటుంబాల్లో విషాదం


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు


సుమిత మృతదేహం


విజయ్ మృతదేహం

మామడ: రెండు కుటుంబాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం దైవ దర్శనానికి వెళ్తుండగా కారు రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్పూర్‌కు చెందిన సుమిత(53), విజయ్(57), నితిన్, అనిత, సుధీర్ నిరంజన్‌లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీశైలం మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేందుకు కారులో బయల్దేరారు. మండలంలోని బూరుగుపల్లి సమీపంలో శనివారం రాత్రి జాతీయ రహదారిపై కోతులు వచ్చాయి. డైవర్ బ్రేక్ వేయడంతో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సుమిత, విజయ్‌లు అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న నితిన్, అనిత, సుధీర్ నిరంజన్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. రెండు కుటుంబాల నుంచి ఒక్కొక్కరు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఏఎస్పీ రాజేష్‌మీనా, ఎస్సై సందీప్‌లు ఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

సైబర్ కేటుగాళ్ల వల

- రూ.10 లక్షల 63 వేలు దండుకున్న వైనం
- కూతురు ఉన్నత చదువు కోసం కన్సల్టెన్సీ పేరిట పంపిన డబ్బులు
- సైబర్ మోసానికి గురైన మాజీ సర్పంచ్


ఆన్‌లైన్‌లో డబ్బులు పంపిన వివరాలు..

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ కేటుగాళ్లు రోజురోజుకు కొత్తపుంతలు తొక్కుతున్నారు. ఏదో విధంగా మాయమాటలు చెప్పి అందినకాడికి దోచుకుంటున్నారు. నిత్యం ఎక్కడో ఒక చోట వారి ఉచ్చులో పడి అమాయకులు మోసపోతూనే ఉన్నారు. బాధితులు డబ్బులు పోగొట్టుకున్న తర్వాత లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు. విద్యావంతులైనప్పటికీ కొందరు వారి మోసాల బారిన పడుతుండడం గమనార్హం. ఇలాంటి సంఘటనే జిల్లాలోని జైనథ్ మండలంలో ఇటీవల చోటుచేసుకుంది. కూతురు ఉన్నత చదువుకోసం కష్టపడి కూడబెట్టుకున్న డబ్బులు సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు అయింది. తీరా తాను మోసపోయినట్లు తెలిసిన తర్వాత బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. ఎవరితో చెప్పుకోలేక మానసిక వేదనకు గురవుతున్నాడు. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. ఎస్సై పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం..

ఏం జరిగిందంటే..

జైనథ్ మండల పరిధిలోని ఓ గ్రామ సర్పంచ్ కూతురు డిగ్రీ పూర్తి చేసింది. లండన్‌లో ఉన్నత చదువు కోసం ఓ కన్సల్టెన్సీని ఆశ్రయించారు. దీన్ని ఆసరా చేసుకున్న సైబర్ నేరగాళ్లు బాధితుడి కూతురుకు ఫోన్ చేసి విదేశాల్లో ఉన్నత చదువుల గురించి వివరించారు. తరచూ ఫోన్ చేస్తూ ఆ యూనివర్సిటీ గురించి, అక్కడ ఉండే వసతులు తదితర వివరాలు చెబుతూ నమ్మించారు. లండన్‌లో ఉండాలంటే ముందుగా అద్దె చెల్లించాల్సి ఉంటుందని, అలాగే ఇతర ఖర్చుల కోసం డబ్బులు పంపించాలని చెప్పారు. దీంతో 20 సార్లు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేశారు. డబ్బులు చెల్లించిన తర్వాత నిజమైన కన్సల్టెన్సీ నుంచి ఫోన్ రావడంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. విషయాన్ని వారికి చెప్పడంతో సైబర్ మోసానికి గురైనట్లు గ్రహించారు. మొత్తం రూ.10 లక్షల 63 వేలను ఆ కన్సల్టెన్సీకి పంపించారు. వెంటనే 1930కు కాల్ చేయడం ద్వారా రూ.70 వేలు ఆ అకౌంట్‌లో ఫ్రీజ్ అయ్యాయి. జైనథ్ పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. డబ్బులు పంపించే సమయంలో సరైన వ్యక్తులకు పంపుతున్నామా లేదా అనే విషయాన్ని సరి చేసుకోవాలని, సైబర్ నేరాలకు బలికావద్దని సూచించారు.

ఎడ్లబండిని ఢీకొన్న బైక్

- పెట్‌పల్లి సమీపంలో ఘటన
- తండ్రికి తీవ్రగాయాలు
- చికిత్స పొందుతూ కుమారుడు మృతి


నిఖిల్ మృతదేహం

పెంబి: మండలంలోని షెట్‌పల్లి సమీపంలో శనివారం రాత్రి ఎడ్లబండిని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి కుమారుడికి తీవ్రగాయాలు కాగా, ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని షెట్‌పల్లికి చెందిన పవర్ రాజు తన కుమారుడు నిఖిల్(6)తో కలిసి బైక్‌పై పెంబికి వచ్చారు. పని ముగించుకొని స్వగ్రామానికి తిరుగు పయనమయ్యారు. మరో మూడు నిమిషాల్లో ఇంటికి చేరుతామనుకునే లోపు ప్రమాదం జరిగింది. షెట్‌పల్లి సమీపంలో ఎడ్లబండిని ఢీకొన్నాడు. ఎద్దు అక్కడికక్కడే మృతిచెందింది. పవర్ రాజు, నిఖిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి క్షతగాత్రులను ఆటోలో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిఖిల్ మృతి చెందాడు. పవర్ రాజు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో హన్మాండ్లు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. జైనథ్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండలంలోని రామాయి గ్రామానికి చెందిన టాప్రే అనిల్ (39) చేపల వేట కోసం శుక్రవారం సాయంత్రం పార్డి(కె), రామాయి గ్రామాల సమీపంలోని సాత్నాల వాగు వద్దకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని పార్డి(కె) సమీపంలోని వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాగు దాటుతూ నీట మునిగి వ్యక్తి మృతి

- మృతుడు మహారాష్ట్ర వాసి


పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): దైవదర్శనానికి వచ్చి ఒకరు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని ఇందాపూర్ వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఇందాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల 16న ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతరకు వచ్చాడు. 17 వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో తండ్రి దౌలత్‌రావు బంధువుల వద్ద వాకబు చేయగా కుమారుడు ఆచూకీ దొరకలేదు. అదేరోజు కెరమెరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఇందాపూర్ వాగులో మృతదేహం కనిపించినట్లు పలువురు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు కోట్నాక మారుదని గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు


బెల్లం పానకం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల నాటుసారా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ చేస్తున్న వారిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు లోబానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం లింగాపూర్, మేదరిపేటలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ప టిక, బెల్లంతోపాటు గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. లింగాపూర్‌లో బోడ పంచిబాయి వద్ద 2 లీటర్ల గుడుంబా, మేదరిపేటలోని గోలి రమేశ్ కిరాణా షా పులో 95 కిలోల బెల్లం, 10 కిలోల పటికను ప ట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడికి పాల్పడిన ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్‌లో ఈనెల 15న బీజేపీ నాయకుడు మిట్టపల్లి జయరామారావుపై దాడికి పాల్పడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చేపల మార్కెట్‌లో జయరామారావు చేపలు కొనుగోలు చేస్తుండగా అకారణంగా సంజీవ్, సాయితేజలు అతనిపై దాడి చేశారు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్


ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాంసి: భీంపూర్ మండలం గుబిడి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నలందప్రియ తెలిపారు. గుబిడి శివారులోని పెన్‌గంగ నది వెంట శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. పెన్‌గంగ నది ఒడ్డున పంట చేలలో పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. 11 చోట్ల నిల్వ చేసిన డంప్‌ల్లో 25 ట్రాక్టర్ల మేర నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ రాందాస్, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్ల చోరీ

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మూడు కంప్యూటర్లు చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చొరబడి కంప్యూటర్ ల్యాబ్ తాళం పగులగొట్టారు. రూ.54 వేల విలువ గల మూడు కంప్యూటర్లకు సంబంధించిన సీపీయూలు, మానిటర్లు, యూపీఎస్‌లు, కీబోర్డు, మౌస్‌లు ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం నరేందర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. చోరీ ఘటన విషయం తెలియడంతో సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు క్లూస్‌టీం సిబ్బందితో విచారణ చేపట్టా రు.

గాయపడిన యువకుడు మృతి


రాజేందర్(ఫైల్)

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్(26) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్, దుర్గం శంకర్ సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో రైతు నవీన్ మామిడితోటలో పని చేస్తున్నారు. ఈ నెల 14న వేకువజామున రాజేందర్, శంకర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. భగవంత్‌రావునగర్‌లో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా, శంకర్ కోలుకున్నాడు.

ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడి ఆత్మహత్య


భీమరాజు (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు భీమరాజు (70) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..భీమరాజు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తన భార్య కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అటు అరోగ్యం సరిగా లేకపోవడంతో మానసికంగా కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణఎస్సై తెలిపారు.